E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు!
ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు

» 2లో

హైదరాబాద్ (తేదీ) 18-02-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:48 || పేజీలు–6 www.ekaburu.com

## తెలంగాణా ప్రజలకు కేంద్రంశుభవార్త..!



- –564 కోట్ల నిధులు విడుదల..
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణానికి నిధులు విడుదల చేసిన కేంద్రం
- తెలంగాణలో 1.45 లక్షల ఇళ్లు నిర్మాణానికి ప్రణాళిక
- ఇప్పటివరకు 60 వేల ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేత
- పంపిణీకి సిద్ధంగా 30 వేల ఇళ్ళు
- మిగిలిన ఇళ్ళు నిధుల కొరతతో నిర్మాణ దశలో
- కేంద్రం నిధుల సహకారంతో పనులు వేగం నిర్వహణ

ఈ కబురు ; తెలంగాణలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిధులు విడుదల చేయడానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 564 కోట్ల రూపాయల మొత్తాన్ని మంజూరు చేయడానికి కేంద్రం పచ్చజెండా ఊపడంతో రాష్ట్రంలో సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునే ఎంతోమంది లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిధుల విడుదల ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలలో వేగం గా జరగనున్నాయి. గతంలో నిధుల కొరత వల్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇక ఆ నిర్మాణాలను తిరిగి ప్రారంభించడానికి కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతగానో దోహదం చేస్తుంది.

తరువాయి 2లో



# ఏఐ ప్రయాణంలో ముందున్నాం

- దానిని సమర్థంగా వినియోగిస్తాం : ప్రధాని మోదీ
- ఏఐ ఎక్స్‌పో, సమిట్‌లకు శ్రీకారం
- 20 వరకూ కొనసాగనున్న అంతర్జాతీయ సదస్సు
- హాజరుకానున్న 20 దేశాల అధినేతలు
- ప్రముఖ కంపెనీల సీఈవోలూ.. 10,000 మందితో భద్రతా ఏర్పాట్లు

**ఈ కబురు, ఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంపై విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించేందుకు భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026, సమిట్‌లు సోమవారం దిల్లీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 20 వరకూ భారత్ మండపం, సుష్మా స్వరాజ్ భవన్, అంబేడ్కర్ సెంటర్ వేదికలుగా జరగనున్న ఈ ఎక్స్‌పో, సమిట్‌లను సోమవారం సాయంత్రం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి.. లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఈ సందర్భంగా ఎక్స్‌లో ఆయన ప్రకటించారు.**

--ప్రపంచాన్ని దగ్గరకు చేర్చాం

ఏఐపై చర్చించడానికి ప్రపంచాన్ని ఒక దగ్గరకు చేర్చామని ప్రధాని పేర్కొన్నారు. 'ప్రపంచ దేశాల నేతలను, పారిశ్రామిక దిగ్గజాలను, ఆవిష్కర్తలను, విధాన నిర్ణేతలను, పరిశోధకులను, టెక్నాలజీ ఔత్సాహికులను ఈ సదస్సు కోసం ఘనంగా స్వాగతిస్తున్నాం. ఈ సమిట్ థీమ్‌గా సర్వజన హితాయ.. సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం) ఉంది. మానవాభివృద్ధి కేంద్రంగా ఏఐని తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నాం. ప్రస్తుతం ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, వ్యాపారం వంటి పలు రంగాలను ఏఐ ప్రభావితం చేస్తోంది. ఆవిష్కరణ, భాగస్వామ్యంతోపాటు బాధ్యతగా వ్యవహరించడంలో దానిని సమర్థంగా వినియోగించేందుకు ఈ సదస్సు దోహదం చేయనుంది. సదస్సు ఫలితాలు భవిష్యత్తు అభివృద్ధి, ఆవిష్కరణ, అవకాశాలకు ఓ రూపు తెస్తాయని నమ్ముతున్నా. ఏఐ ప్రయాణంలో ముందున్నందుకు సహకరించిన 140 కోట్ల మంది భారతీయులకు ధన్యవాదాలు' అని ప్రధాని పేర్కొన్నారు. ఏఐ ఎక్స్‌పోను ప్రారంభించిన అనంతరం ప్రధాని.. స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో మాట్లాడారు. పలు స్టాళ్లను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు.

తరువాయి 2లో



2

## ఎవరెస్టంత ఎత్తు వెళ్లే హెలికాప్టర్లు భారత్‌లోనే తయారీ... మోదీ

ఈ కబురు : భారత్- ఫ్రాన్స్ సంబంధాలు ప్రత్యేకమైనవని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ దేశం దశాబ్దాలుగా భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామిగా ఉందన్నారు. కర్ణాటకలోని వేమగల్‌లో ఎయిర్‌బస్ హెచ్-125 హెలికాప్టర్ల తయారీ అసెంబ్లీ లైన్‌ను ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు.



2

## నాడు కెసిఆర్ ధృడ సంకల్పంతోనే తెలంగాణ సాధ్యమైంది

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ఈ కబురు, హైదరాబాద్ :

నాడు మాజీ సిఎం కెసిఆర్ ధృడ సంకల్పంతోనే తెలంగాణ సాధ్యమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. ఇటీవల కెసిఆర్ మీద పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్ లో 72 కిలోల కేక్ తో కెసిఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి.



2

## విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలి

ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈ కబురు : విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసనసభకు రావటం ఎమ్మెల్యేల విధి అన్నారు. అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు చిట్ చాట్ చేశారు.

## భారత ఆర్థిక వ్యవస్థలో మార్పు

- దేశవ్యాప్తంగా జరిగే ఆర్థిక లావాదేవీల్లో నగదు వాటా తగ్గుముఖం
- "డిజిటల్" మాత్రం ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక



తరువాయి 3లో

## ప్రత్యూష కేసులో సుప్రీం తుది తీర్పు



- సిద్ధార్థ రెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలి

ఈ కబురు, హైదరాబాద్ :

24 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన ప్రత్యూష కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పు వెల్లడించింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

.... 3లో

## తెలంగాణ లో పెట్టుబడులకు సంపూర్ణ మద్దతు

సిప్రపంచ దిగ్గజ కంపెనీలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు



ఈ కబురు , హైదరాబాద్ :

వ్యాక్సిన్ తయారీలో ప్రపంచ రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను జీవవైజ్ఞానిక రాజధానిగా ఎదిగేందుకు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బయోఏషియా 2026 సదస్సు వేదికగా జీవవిజ్ఞాన రంగానికి చెందిన ప్రపంచ దిగ్గజ కంపెనీలు, శాస్త్రవేత్తలు, నిపుణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ దేశంలోని మిగతా రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతోందని, ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా మారిన హైదరాబాద్‌ను ఇప్పుడు అందరం కలిసి సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని కోరారు.

తరువాయి 2లో

## "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్"గా హైదరాబాద్

- లైఫ్ సైన్సెస్ రంగంలో 2030 నాటికి కొత్తగా 5 లక్షల మందికి ఉద్యోగాలు
- ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా తెలంగాణను నిలిపేలా కృషి
- "బయో ఏషియా 2026" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

తరువాయి 2లో

ఈ కబురు, హైదరాబాద్ :

ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్ ను "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్" గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి...






## హైదరాబాద్ లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలి

- అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ఈ కబురు, హైదరాబాద్ :

హైదరాబాద్ లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న చోట స్కైవాక్ బ్రిడ్జిలు, అవసరమైన చోట పిపిపి విధానంలో స్కైవాక్ లు నిర్మించాలని అన్నారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖపై, సిఎస్, సిఎంవో సెక్రటరీ, హెచ్ఎండిఎ కమిషనర్ తో సిఎం సమీక్షించారు. జిహెచ్ఎంసి విభజనలో తలెత్తిన సమస్యల పరిష్కారాలు సూచించారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వద్ద మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని, ప్రకటన బోర్డుల ఏర్పాటుపై జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం ఆదేశాలిచ్చారు.

తరువాయి 2లో

## చెత్త కనిపిస్తే సహించేది లేదు

- త్వరలో క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తా
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్ష
- ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశం



ఈ కబురు , హైదరాబాద్ :

రాజధాని పరిధిలోకి వచ్చే మూడు నగరపాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. త్వరలోనే తాను పరిశీలనకు వస్తానని, అపరిశుభ్రంగా కనిపిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మూడు కార్పొరేషన్ల కమిషనర్లు ఉదయం 6 గంటల నుంచే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలన్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లలో తాను పర్యటిస్తానని, ఎక్కడైనా చెత్త కనిపిస్తే సహించేది లేదన్నారు. ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు నగరంలోని కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని, వాటిపై సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం ద్వారా ఆదాయం వచ్చే మార్గాన్ని పరిశీలించాలన్నారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూరులలో ప్రకటనల ద్వారా వస్తున్న ఆదాయం.. ఇక్కడ వస్తున్నదాన్ని బేరీజు వేయాలని, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనలదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రకటనల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు పదిశాతం కేటాయించాలని సూచించారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు ముఖ్యమంత్రికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

.... 2లో

## కెసిఆర్ ఉద్యమకారుడు, చరిత్రకారుడు, పాలనాదక్షుడు



ఈ కబురు, హైదరాబాద్ :

మాజీ సిఎం కెసిఆర్ ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ సాధించారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. పదవుల కోసం కాంగ్రెస్, బిజెపిలు కలిసిపోయాయని అన్నారు. తెలంగాణ భవన్ లో కెసిఆర్ బర్త్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు.

.... 2లో

## శ్రీలంక సర్కారు కీలక నిర్ణయం.. ఎంపీల పెన్షన్లు రద్దు



ఈ కబురు ; పొరుగు దేశం శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపీల పెన్షన్లను పూర్తిగా రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో మంగళవారం ఆమోదం పొందింది. 225 మంది సభ్యులు కలిగిన సభలో 154 మంది ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేశారు.

.... 2లో

# ఏఐ ప్రయాణంలో ముందున్నాం



సదస్సులో భాగంగా.... 3,250 మంది అతిథులు వివిధ వేదికలపై మాట్లాడనున్నారు. 500 సెషన్లు జరుగుతాయి. ఏఐ యుగంలో ఉపాధి అవకాశాలు, నైపుణ్యం, సురక్షిత, నమ్మకమైన ఏఐ, ఏఐ గవర్నెన్స్, మౌలిక వసతులు, జనరేటివ్ ఏఐ డిప్లాయ్‌మెంట్, ప్రభుత్వ రంగంలో వినియోగం వంటి అంశాలపై చర్చలు సాగుతాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఏఐ ఎక్స్‌పో, సమిట్‌కు సోమవారం పలువురు పోటెత్తారు. టెక్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, టెక్నాలజిస్టులు భారీగా హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు ముందే భారత్ మండపం ఎదుట క్యూలు కనిపించాయి. ఈ ఎక్స్‌పోకు ఎవరైనా హాజరుకావొచ్చని ప్రభుత్వం ప్రకటించింది. 5 రోజుల్లో మొత్తం 2 లక్షల మందికిపైగా హాజరవుతారనే అంచనాలున్నాయి. సందర్శకులు డిజి యాత్ర, ఏఐ సదస్సు యాప్‌లలో రిజిస్టరు చేసుకోవాల్సి ఉంటుంది. ఎక్స్‌పోలో గూగుల్, ఎన్‌విడియా, అమెజాన్, మెటా, ఓపెన్‌ఏఐతోపాటు స్థానిక ఏఐ సంస్థలు పాల్గొని నూతన ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నాయి. 600 స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలతో వచ్చాయి. వివిధ కంపెనీల తరఫున 300 స్టాళ్లు ఏర్పాటయ్యాయి. ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్తోనియా, తజికిస్థాన్, ఆఫ్రికా దేశాల పెవిలియన్లు కొలువుదీరాయి. కేంద్ర మంత్రిత్వశాఖలు, రాష్ట్రాలు తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి.

**——దక్షిణార్ధ గోళంలో తొలి ఎక్స్‌పో**

ఈ ఎక్స్‌పో, సమిట్‌లను కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. దక్షిణార్ధ గోళ దేశాల్లో నిర్వహిస్తున్న మొట్టమొదటి అంతర్జాతీయ స్థాయి ఏఐ ఎక్స్‌పో, సమిట్ ఇవే కావడం గమనార్హం. కృత్రిమ మేధవల్ల ప్రయోజనాలు, సవాళ్లపై ఇందులో చర్చలు జరగనున్నాయి.

**——కట్టుదిట్టమైన భద్రత**

ఏఐ ఎక్స్‌పో, సమిట్‌కు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. 10,000 మంది బలగాలను మోహరించింది. ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తోంది. ట్రాఫిక్ నియంత్రణకు 5,000 మంది పోలీసులను నియమించింది. ఈ నెల 17వ తేదీ నుంచి సీబీఎస్‌ఈ పరీక్షలు ప్రారంభం కానున్నందున విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోనున్నారు.



## "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్"గా హైదరాబాద్




కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో రాష్ట్రాన్ని ఒకటిగా నిలిపేందుకే "తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026 2030)" రూపొందించామని మంగళవారం హెచ్‌ఐసీసీ లో నిర్వహించిన "బయో ఏషియా 2026" సదస్సు ఆయన వివరించారు. ఇప్పటి వరకు లైఫ్ సైన్సెస్ రంగంలో సప్లై కోసం మాత్రమే మన వైపు చూసిన ప్రపంచం ఇప్పుడు ప్రస్తుతం ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం చూస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా తెలంగాణను అన్ని రకాలుగా సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఎంఆర్ఎన్ఏ (mRNA), జీన్ ఎడిటింగ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి అత్యాధునిక రంగాల్లో "రెడీ టూ వర్క్ ఫోర్స్"గా ఇక్కడి యువతను తయారు చేస్తున్నామన్నారు. సీబీఆర్ఈ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ (2025) ప్రకారం, బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, బీజింగ్, టోక్యో లాంటి గ్లోబల్ హబ్‌ల సరసన నిలిచిన ఏకైక భారతీయ నగరం హైదరాబాద్ అని అన్నారు. అందుకే... కేవలం ఉత్పత్తి చేయడమే కాకుండా, నేటి అవసరాలకు అనుగుణంగా కొత్త ఔషధాలను కనుగొనే కేంద్రంగానూ హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అలాగే... గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్ గానూ మార్చేందుకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, ఆటోమేషన్ ఇన్ బయోలాజిక్స్ మాన్యుఫాక్చరింగ్, డేటా ఆధారిత ప్రెసిషన్ మెడిసిన్ , కంప్యూటేషనల్ బయాలజీ, బయో మాన్యుఫాక్చరింగ్ 4.o తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

### నాడు కెసిఆర్ ధృఢ సంకల్పంతోనే
## తెలంగాణ సాధ్యమైంది



ఈ కార్యక్రమంలో కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో బాగుండాలని ఆకాంక్షించారు. ఏ జాతికి పిత అంటూ సన్నాసులు అవాకులు చవాకులు పేలుతున్నారని, జాతి మీద, జాతి అహంకారం మీద అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. 2001 లో బలమైన రాజకీయ శక్తులను ఢీకొట్టిన యోధుడని, దేశానికి తెలంగాణను రోల్ మోడల్ గా తీర్చిదిద్దిన నాయకుడు కొనియాడారు. 2001లో తెలంగాణ కోసం బయల్దేరిన నాడు పరిస్థితి ఏంది? అని ప్రశ్నించారు. నీతి ఉన్న..రీతి ఉన్న జాతి తమది అని, జన్, జంగిల్, జమీన్ కోసం పోరాడిన కుమురంభీం జాతి తమది అని తెలియజేశారు. అప్పటి మాజీ కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ కెసిఆర్ గురించి ఎంతో అద్భుతంగా చెప్పారని కెటిఆర్ పేర్కొన్నారు.

### ఎవరెస్టంత ఎత్తు వెళ్లే హెలికాప్టర్లు
## భారత్‌లోనే తయారీ... మోదీ



ఫ్రాన్స్ సాయంతో ఎవరెస్టంత ఎత్తు వెళ్లగలిగే హెలికాప్టర్‌ను తయారు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముంబయిలోని లోక్‌భవన్‌లో సమావేశమైన ఇరువురు నేతలు.. ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అనంతరం మీడియా ముందు ఆ వివరాలు వెల్లడించారు. ''భారత్‌కు పురాతన వ్యూహాత్మక భాగస్వామిగా ఫ్రాన్స్ కొనసాగుతోంది. రఫేల్ జెట్‌ల నుంచి సబ్‌మెరైన్ వరకు రక్షణ రంగంలో పరస్పరం సహకరించుకుంటున్నాం. ఎవరెస్టంత ఎత్తు వెళ్లగలిగే హెలికాప్టర్లను ఫ్రాన్స్ సహకారంతో భారత్‌లోనే తయారు చేయనున్నాం. యావత్ ప్రపంచానికి ఇక్కడ నుంచే ఎగుమతి అవుతాయి. భారత్, ఐరోపా సంబంధాల్లో ఈ ఏడాది ఎంతో కీలకం. కొన్నిరోజుల క్రితమే ఐరోపా కూటమితో చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్న వేళ.. ప్రపంచ స్థిరత్వానికి ఇరు దేశాల భాగస్వామ్యం ఓ శక్తిగా మారుతుంది. బహుళ ధ్రువ ప్రపంచాన్ని మేం విశ్వసిస్తాం'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మాట్లాడుతూ.. భారత్ తమకు ఎంతో విశ్వసనీయ భాగస్వామి అన్నారు. ఇరు దేశాలు చట్టబద్ధ పాలనను బలంగా నమ్ముతాయని, కొన్నేళ్లుగా దీన్ని రెండు దేశాలు నిరూపించాయన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సహకరిస్తామన్నారు.

### విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు
## రీకాల్ చేయాలి

కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదని సూచించారు. ఉద్యోగులకు జీతాలు కట్ చేసే నిబంధనల ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించకూడదు? అని ప్రశ్నించారు. ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చ చేపట్టానని, ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉందని తెలియజేశారు. అసెంబ్లీ లో ప్రవేశ పెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పనిచేస్తోందని, ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారనేది కూడా రికార్డవుతోందని అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

### తెలంగాణ ప్రజలకు
## కేంద్రం శుభవార్త..!




ఈ నిధుల విడుదల ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి వీలు కలుగుతుంది. తెలంగాణ ప్రభుత్వ అధికారులు ఈ నిధుల కోసం ఇటీవల ఢిల్లీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అధికారులను కలిసి, పెండింగ్లో ఉన్న నిధులను త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు ఇక తెలంగాణ అధికారుల విజ్ఞప్తి తో సానుకూలంగా స్పందించిన కేంద్రం త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట మేరకు తాజాగా 564 కోట్ల రూపాయలను విడుదల చేసింది.మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 1.45 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించడానికి ప్రణాళికను రూపొందించగా, ఇప్పటివరకు 60 వేల ఇళ్ళను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదనంగా సుమారు 30 వేల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయగా అవి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన ఇళ్ళు నిర్మాణ దశలోనే ఉండి నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయి. ఇప్పుడు కేంద్రం నిధులను విడుదల చేయడంతో ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసి సొంత ఇల్లు, సొంత స్థలం లేని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించనుంది. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులు పొందడం కోసం లబ్ధిదారుల పేర్లు, పూర్తి వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టులో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని నిబంధనలను విస్మరించింది. అయితే కాంగ్రెస్ నిబంధనలు పాటించటంతో నిధులు విడుదల కు అవకాశం ఏర్పడింది. ఇల్లు నిర్మించి, పంపిణీ కూడా చేసిన తర్వాత లబ్ధిదారుల వివరాలను సమర్పించడంతో కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చెయ్యలేదు. అయితే ముందుగానే పోర్టల్ లో అప్ లోడ్ చేసిన తర్వాత కేంద్రం నిధులు ఇస్తుంది కాబట్టి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిబంధన ప్రకారమే కేంద్ర పోర్టల్ లో అప్లోడ్ చేసింది. దీంతో కేంద్రం నిధులను విడుదల చేయనుంది.

### తెలంగాణ లో పెట్టుబడులకు
## సంపూర్ణ మద్దతు



హైదరాబాద్ హైటెక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా (BioAsia 2026) అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ప్రారంభించారు. ప్రధానంగా 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రపంచస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. "ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుంచి ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతుంది. అందుకు తెలంగాణ ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది. ఈ ఎదుగుదలలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జీవవైజ్ఞానిక రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆధునిక మార్పులను గమనిస్తే, పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం ఉంది. ఆయా సంస్థలు, కార్పొరేట్లు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. ఆ వాతావరణాన్ని తెలంగాణ అందిస్తుంది. అందుకు హైదరాబాద్ అనుకూలమైంది. బల్క్‌డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచస్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. GCC లను స్థాపించండి. ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండి. మాలిక్యూల్స్ , ఔషధాలను డిజైన్, క్లినికల్ అనలిటిక్స్‌ను ప్రారంభించండి. AI ప్లాట్‌ఫామ్‌లను, డిజిటల్ తయారీ రంగాలను ముందుకు తీసుకెళ్లండి. అందుకు ప్రభుత్వం, యంత్రాంగం, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయంలో భాగస్వాములుగా ఉంటారు. 23 ఏళ్ల కిందట బయోఏషియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్ వేర్ నగరంగా గుర్తింపు ఉండేది. ఇప్పుడు హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా కూడా నిలిచింది. దూరదృష్టి కలిగిన నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు ఉండటం వల్ల హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు, పరిశోధన, డిజైన్ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా ఎదిగింది. తెలంగాణలో గడిచిన రెండేళ్లలో జీవవిజ్ఞాన రంగంలో రూ. 73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా తెలంగాణ నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం. జినోమ్ వ్యాలీని విస్తరించాం. అలాగే, ప్రపంచ స్థాయి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం వన్‌బయోను ప్రారంభించాం. జీవవైజ్ఞానిక రంగంపై మా ఆలోచనలను తెలంగాణతో పాటు మీ అందరితో పంచుకుంటున్నాను. ఇటీవలే మేం "తెలంగాణ రైజింగ్ 2047" విజన్‌ను ఆవిష్కరించాం. తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నది మా లక్ష్యం. గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేస్తూ అనేక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆహ్వానించాం. ఒక బలమైన సంకల్పంతో ఈ పురోగతిని సాధించాం. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే బయోఏషియా2026 సదస్సు. ఇప్పుడు బయోఏషియా తన పరిధిని విస్తరించుకుని "బయోవరల్డ్"గా మారుతోంది. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలు, దాదాపు 4 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, హెల్త్‌కేర్ రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొన్నారు. హైదరాబాద్ లో లో జరుగుతున్న ఈ BioAsia సదస్సు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (World Economic Forum) లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న విశ్వాసం నాకుంది" అని ముఖ్యమంత్రి పేర్కొంటూ, ప్రపంచ నలుమూలల నుంచి బయోఏషియా సదస్సుకు హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్ గారికి జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు2026 అందించారు.

## చెత్త కనిపిస్తే సహించేది లేదు



దీన్ని పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. మల్టీలెవల్ పార్కింగ్‌పై అధ్యయనం చేయాలని, నెక్లెస్‌రోడ్డు పక్కన ఇలాంటి మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వీధి దీపాల నిర్వహణకు ఏకరూప పద్ధతిని అనుసరించాలన్నారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలోని పార్కుల వివరాలు సేకరించి వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లకు త్వరలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని, తాను కూడా హాజరై వారితో మాట్లాడతానని సీఎం తెలిపారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్వీ కర్ణన్, సృజన, వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డేటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయాలి
వివిధ రాష్ట్రాలు డేటా సెంటర్లకు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు, వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై సీఎం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ''రైతులు సంతృప్తి చెందేలా భూ పరిహారం నిర్ణయించాలి. పరిశ్రమలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే పనులు త్వరగా చేసుకుంటారు'' అని సీఎం పేర్కొన్నారు. సీఎస్ రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సంజయ్‌కుమార్, నవీన్ మిత్తల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక పాల్గొన్నారు.

## కెసిఆర్ ఉద్యమకారుడు, చరిత్రకారుడు, పాలనాదక్షుడు
### .. బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హరీష్ రావు, పార్టీ శ్రేణులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ ఉద్యమకారుడు, చరిత్రకారుడు, పాలనాదక్షుడు అని కొనియాడారు. కెసిఆర్ లేకుంటే తెలంగాణ వచ్చి ఉండేదా? అని హరీష్ రావు ప్రశ్నించారు. నాది తెలంగాణ అని చెప్పుకునే పరిస్థితి లేకుండా అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్స్ లో కెసిఆర్ ను చూసినప్పుడు తమ కళ్లల్లో నీళ్లు తిరిగాయని, ఆయన చివరి దశలో ఉన్నాడని ఆనాడు డాక్టర్లు తమకు చెప్పారని తెలియజేశారు. ఏ ప్రలోభాలకు తలొగ్గకుండా పోరాటం చేశారని, కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ధర్మం దారి తప్పినప్పుడే దేవుడే దారి చూపిస్తాడని హరీష్ రావు పేర్కొన్నారు.

### హైదరాబాద్ లో స్మార్ట్ పోల్స్
## ఏర్పాటుపై అధ్యయనం చేయాలి



ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాల కోసం 10 శాతం ప్రకటన బోర్డులు కేటాయించాలని అన్నారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి ఏడాదికోసారి ఫీజు వసూలు చేయాలని, నగరంలో వీధిదీపాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మూడు కార్పొరేషన్లలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, హైదరాబాద్ లో త్వరలో ప్రతి జోన్ లో పర్యటిస్తానని తెలియజేశారు. రోడ్లు శుభ్రంగా లేకుంటే అధికారులను సస్పెండ్ చేస్తామని, కమీషనర్లు, జోనల్ కమిషనర్లు పొద్దున్నే ఫీల్డ్ లో ఉండాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### శ్రీలంక సర్కారు కీలక నిర్ణయం..
## ఎంపీల పెన్షన్లు రద్దు



శ్రీలంకకు కరోనా, ఉగ్రవాద దాడుల కారణంగా విదేశీయుల రాక తగ్గింది. నాటి పాలకుల ఆర్థిక నిర్వహణ లోపం కారణంగా పరిస్థితి మరింత తీవ్రమైంది. 2022లో దివాళా తీసింది. దీంతో నాటి పాలకులపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేశంలో ఆహారం, ఔషధాలు, విద్యుత్, చమురుకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది. ప్రజల నుంచి ఆందోళనలు చెలరేగడంతో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మార్క్సిస్టు నేత దిసనాయకే విజయం సాధించి అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడంలో భాగంగా ఎన్నికల వాగ్దానంలో ఒకటైన పెన్షన్ల రద్దుకు బిల్లు తీసుకొచ్చారు. దేశం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న వేళ చట్టసభ సభ్యులకు పెన్షన్లు పొందే నైతికత లేదంటూ ఈ బిల్లుపై చర్చ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి హర్షణ నానాయక్కర పేర్కొన్నారు. కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. మిగిలిన సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. శ్రీలంకలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన పార్లమెంట్ సభ్యులకు ప్రస్తుతం పెన్షన్ అందుతోంది. కొత్త చట్టం ఆమోదం పొందడంతో ఇప్పటికే అందుకుంటున్న వారితో పాటు, కొత్తగా అర్హత సాధించిన వారికీ పెన్షన్లు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే మాజీ అధ్యక్షులకు ఇచ్చే ప్రయోజనాలను దిసనాయకే ప్రభుత్వం నిలిపివేసింది. ఇంటి అద్దె, అలవెన్సులు, పెన్షన్లు, రవాణా సౌకర్యాలను గతేడాది సెప్టెంబర్‌లో రద్దు చేసింది. పర్యాటకంపై ఆధారపడిన దేశమైన

### ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు!
## ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు



ఈ కబురు ; అమెరికాఇరాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించబోదన్నారు. అంతేకాదు.. ప్రపంచంలో బలమైన సైనిక శక్తి ఉన్నవాళ్లకూ తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చన్నారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. జెనీవా వేదికగా ఇరాన్‌అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ''తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. అయితే, ఒక్కోసారి అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇరాన్ దిశగా యుద్ధ నౌకలను పంపించామని ప్రకటనలు చేస్తున్నారు. ఆ నౌకలు నిజంగా ప్రమాదకరమైనవి. కానీ, వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యమున్న ఆయుధం మరింత ప్రమాదకరం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని అమెరికా అంగీకరించడం శుభపరిణామం. ఎన్నటికీ ఏమీ చేయలేరు. అణు చర్చలు జరుపుదాం అంటున్నారు. కానీ, చివరకు మీ దగ్గర అణ్వాయుధాలు ఉండకూదని చెబుతున్నారు. చర్చల ఫలితాలను ముందుగానే నిర్ధరించడం తప్పిదం, మూర్ఖత్వమే'' అని ఖమేనీ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు.

**——మూడు గంటల్లో ముగిసిన చర్చలు..**

జెనీవా వేదికగా అమెరికాఇరాన్ మధ్య జరిగిన అణు చర్చలు మూడు గంటల్లో ముగిశాయి. చర్చల సమయంలోనే హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఈ సందర్భంగా జలసంధిని కొన్ని గంటల పాటు మూసివేసింది. ఈ క్రమంలో లైవ్ క్షిపణులను ప్రయోగించడం గమనార్హం. ఆ ప్రాంతంలో అమెరికా సైన్యాన్ని మోహరిస్తున్న వేళ టెహ్రాన్ ఈ చర్యలకు ఉపక్రమించింది.

## నల్లగండ్ల డివిజన్ సమస్యలపై

# మంత్రి పొంగిలేటిని కలిసిన పల్లపు సురేందర్

## ..మంత్రి దృష్టికి ప్రాపర్టీ టాక్స్ సమస్య

ఈ-కబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మంగళవారం నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ భేటీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం మంత్రి పొంగులేటి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులతో కలిసి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన సురేందర్ డివిజన్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా నల్లగండ్ల డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రాపర్టీ టాక్స్ సమస్యను మంత్రికి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి పల్లపు సురేందర్


కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రిని కలిసిన సురేందర్ తదితరులు

దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారని సురేందర్ అన్నారు. ఈ సందర్భంగా పల్లపు సురేందర్ మాట్లాడుతూ నల్లగండ్ల డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఇప్పటికే డివిజన్ వ్యాప్తంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించామని, వాటి పరిష్కారానికి అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో సురేందర్ తో పాటు నల్లగొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## అంతర్జాతీయ వేదికపై

# భారత పతాకం రెపరెపలు



తాను సాధించిన మెడల్స్ తో డాక్టర్ కొలన్ జగజ్జీవన్ రెడ్డి

- అబుదాబిలో ఓపెన్ లో బంగారు పతకాలు సాధించిన కొలన్ జగజ్జీవన్ రెడ్డి
- 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగుల్లో సత్తా చాటిన హైదరాబాద్ వాసి

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనడమే పెద్ద సవాలు కాగా, విశ్వవేదికపై రెండు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించడం అరుదైన ఘనతగా నిలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబిలో ఎమిరేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ మాస్టర్స్ గేమ్స్-2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ డాక్టర్ కొలన్ జగజ్జీవన్ రెడ్డి 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగుపందాల్లో మొదటి స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి 6న ప్రారంభమైన ఈ క్రీడా మహోత్సవంలో 148 దేశాలకు చెందిన సుమారు 27 వేల మంది క్రీడాకారులు పాల్గొనగా, తీవ్ర పోటీ మధ్య ఆయన ప్రదర్శించిన పట్టుదల, స్థైర్యం ప్రత్యేకంగా నిలిచింది. 2024లో అమెరికాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన జగజ్జీవన్ రెడ్డి, అదే ఆత్మవిశ్వాసంతో అబుదాబి వేదికపై మరోసారి ప్రతిభ చాటుతూ దేశానికి కీర్తి తీసుకువచ్చారు. భారత పతాకం ఎగురవేయడం ప్రతి క్రీడాకారుడి కల కాగా, స్వర్ణ పతకాలతో దేశానికి గౌరవం తేవడం గర్వకారణమని డాక్టర్ జగజ్జీవన్ రెడ్డి పేర్కొన్నారు; రాబోయే రోజుల్లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి దేశ ప్రతిష్ఠను మరింత పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని జగజ్జీవన్ రెడ్డి తెలిపారు.

## మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- కొండాపూర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

ఈకబురు, శేరిలింగంపల్లి : బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన కెసిఆర్ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండాపూర్ లోని జిల్లా ఆసుపత్రిలో రోగులకు సాయిబాబా ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో సాయిబాబా పాల్గొని కేక్ కట్ చేసి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ది అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం మొదటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లారని తెలిపారు. దేశంలో కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని అభివృద్ధిలో మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందన్నారు. నేడు తెలంగాణ ప్రజలు కేసిఆర్ పాలనను కోరుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించి మరోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు. కెసిఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగం జంగయ్య యాదవ్, దారుగుపల్లి నరేష్, రాజు ముదిరాజ్, అశోక్ యాదవ్, రాగం శంకర్ యాదవ్, రమేష్ గౌడ్, నారాయణ, శామ్లెట్


కొండాపూర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సాయిబాబా తదితరులు


కొండాపూర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సాయిబాబా తదితరులు



## భారత ఆర్థిక వ్యవస్థలో మార్పు

ఈ కబురు ; భారత ఆర్థిక వ్యవస్థలో ఒక వింత పరిస్థితి నెలకొంది. ప్రజల చేతుల్లోనూ, బ్యాంకుల వద్ద ఉండే నగదు ఈ ఏడాది జనవరి నాటికి రికార్డు స్థాయిలో 40 లక్షల కోట్లకు చేరుకుంది.ఇది గతేడాది కంటే 11.1 శాతం ఎక్కువ.అయితే,చేతిలో నగదు పెరుగుతున్నా,దేశ వ్యాప్తంగా జరిగే ఆర్థిక లావాదేవీల్లో నగదు వాటా మాత్రం తగ్గుముఖం పట్టడం విశేషం. గతంలో కరోనా సమయంలో (మార్చి 2021) నగదు-జీడీపీ నిష్పత్తి 14.4 శాతం గా ఉండేది. కానీ, తాజా గణాంకాల ప్రకారం ఇది 11.2శాతానికి పడిపోయింది. అంటే, దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతున్నప్పటికీ, రోజువారీ అవసరాలకు భౌతిక నగదు కంటే డిజిటల్ చెల్లింపులనే ప్రజలు ఎక్కువగా ఆశ్రయిస్తున్నారని ఇది స్పష్టం చేస్తోంది. జూలై 2025లో యూపీఐ లావాదేవీల ఆధారంగా సుమారు 18,000 మంది చిన్న వ్యాపారులకు జీఎస్టీ నోటీసులు అందాయి. దీనివల్ల కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో ఏటీఎం విత్‌డ్రాయల్స్ అకస్మాత్తుగా పెరిగాయి. చిన్న వ్యాపారులు మళ్లీ నగదు వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో, ప్రజలు డబ్బును బ్యాంకుల్లో ఉంచడం కంటే అత్యవసరాల కోసం చేతిలో ఉంచుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరగడం లేదా ఇతర అవసరాల కోసం గృహస్థులు బంగారం, వెండి విక్రయించి నగదు నిల్వలు పెంచుకుంటున్నారు.డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ అప్రతిహతంగా దూసుకుపోతోంది.మార్చి 2020లో కేవలం 140 కోట్లుగా ఉన్న నెలవారీ యూపీఐ లావాదేవీలు, డిసెంబర్ 2025 నాటికి 2,163 కోట్లకు చేరాయి.జనవరి 2026 గణాంకాల ప్రకారం, దేశంలో రోజుకు సగటున 70 కోట్ల యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా ఏకంగా 70-80 శాతానికి చేరింది. 2,000 నోట్ల ఉపసంహరణ తర్వాత,500 నోట్ల ప్రాధాన్యత పెరిగింది. ఏప్రిల్ 2025 నుండి జనవరి 2026 మధ్య వీటి వాటా 4.4 శాతం పెరిగింది. అదే సమయంలో,20 కంటే తక్కువ విలువ కలిగిన చిన్న నోట్ల వాటా క్రమంగా తగ్గుతోంది.మొత్తం మీద దేశంలో ఒక నిర్మాణాత్మక మార్పు కనిపిస్తోంది. ప్రజలు భద్రత కోసం లేదా నిల్వ కోసం నగదును రికార్డు స్థాయిలో దగ్గర ఉంచుకుంటున్నప్పటికీ, రోజువారీ కొనుగోళ్లు మరియు ఆర్థిక కార్యకలాపాల కోసం మాత్రం డిజిటల్ వ్యవస్థలపైనే (ముఖ్యంగా యూపీఐ) ఎక్కువగా ఆధారపడుతున్నారు. 'నగదు' తన రూపాన్ని మార్చుకుంటూ కేవలం అత్యవసర నిధిగా మారుతుండగా, 'డిజిటల్' మాత్రం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది.

## నవశక్తి యూత్ ఆధ్వర్యంలో

# క్రికెట్ టోర్నమెంట్


విజేతలకు బహుమతులు, ట్రోఫీ అందజేస్తున్న ఆంజనేయులు సాగర్



విజేతలకు బహుమతులు, ట్రోఫీ అందజేస్తున్న ఆంజనేయులు సాగర్

- విజేతలకు నగదు బహుమతులు అందజేసిన ఆంజనేయులు సాగర్

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్‌లో నవశక్తి యూత్ ప్రతినిధి మదిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్ పిచ్ ఐదు ఓవర్ల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా జరిగింది. శేరిలింగంపల్లి పరిధిలోని అన్ని డివిజన్ల నుంచి 34 టీమ్స్ తో యువత భారీగా పాల్గొని పోటీని రసవత్తరంగా మార్చారు. గ్రాండ్ ఫైనల్లో విజేతగా నిలిచిన మాడి టీం - మసీద్ బండ జట్టుకు 10వేల నగదు బహుమతి, రన్నర్ అప్‌గా నిలిచిన గంటల నరేష్ టీం - శ్రీరామ్ నగర్ జట్టుకు 5వేల నగదు బహుమతిని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ గారు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఐక్యతతో ముందుకు సాగితే సమాజం బలపడుతుందన్నారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు యువతలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. యువతే రేపటి భారతదేశానికి బలమైన స్థంభం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిక్ నగర్ కాలనీ జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, గువ్వల రమేష్, నాయకులు రాము, జుబేర్ తో పాటు సిద్ధిక్ నగర్ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఆంజనేయులు సాగర్

# గౌలిదొడ్డిలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సాయిబాబా తో కలిసి కెసిఆర్ జన్మదిన వేడుకల్లో రాగం జంగయ్య యాదవ్, హరిశంకర్ యాదవ్

- హరిశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్మికులకు బట్టలు పంపిణీ

ఈకబురు, శేరిలింగంపల్లి : బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో ఘనంగా నిర్వహించారు. నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం జంగయ్య యాదవ్, రాగం హరిశంకర్ యాదవ్ ల ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ వేడుకలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి జంగయ్య యాదవ్, హరిశంకర్ యాదవ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన ఘనత తెలంగాణ జాతిపిత కెసిఆర్ దేనని అన్నారు. ముఖ్యమంత్రిగా పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు మరోసారి కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రత్యూష కేసులో సుప్రీం తుది తీర్పు

హైకోర్టు విధించిన జైలు శిక్షను సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సిద్ధార్థ రెడ్డి పిటిషన్ కొట్టివేయడంతో పాటు లొంగిపోవాలని ఆదేశించింది. ప్రత్యూష అనే యువతి సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇంటర్ చదువుతున్నపుడు సిద్ధార్థరెడ్డి పరిచయం కావడంతో ఇద్దరు ప్రేమలో పడ్డారు. వీళ్ల ప్రేమను సిద్ధార్థ రెడ్డి కుటుంబం ఒప్పుకోకపోవడంతో 2002 ఫిబ్రవరి 23న ప్రేమ జంట పురుగుల మందు తాగారు. వెంటనే ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రత్యూష చనిపోగా సిద్ధార్థరెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రత్యూషను ఆత్మహత్యకు ఉసిగొల్పాడని అతడికి స్థానిక కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అతడు హైకోర్టును ఆశ్రయించడంతో సిద్ధార్థ రెడ్డికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. తన కూతురిది ఆత్మహత్య కాదని ప్లాన్ చేసి హత్య చేశారని సుప్రీంకోర్టులో ప్రత్యూష తల్లి సరోజినీ దేవి పిటిషన్ వేసింది. ఇవాళ సుప్రీంకోర్టు విచారణ జరిపి తుది తీర్పు ఇచ్చింది. సిద్ధార్థ రెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేయడంతో పాటు రెండేళ్ల జైలు శిక్షను కూడా సమర్థించింది. సిద్ధార్థ రెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. టాలీవుడ్‌లో సముద్రం, రాయుడు, కలుసుకోవాలని సినిమాలలో నటించి ప్రత్యూష మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంది. బాలనటిగా ప్రేక్షకుల మెప్పుపొందారు. ఆమె కెరీర్ పీక్ స్టేజీలో ఉన్నప్పుడు ఆమె హఠాత్తుగా చనిపోవడంతో అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. 24 సంవత్సరాల తరువాత నిందితుడికి శిక్ష పడడంతో ఆమె అభిమానులు సరైన న్యాయం జరిగిందని తెలిపారు.

## డేటా సెంటర్లపై 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి: అదానీ గ్రూప్




అహ్మదాబాద్: గౌతమ్ అదానీకి చెందిన వ్యాపార సంస్థ అదానీ గ్రూప్ (Adani Group) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో భారీ పెట్టుబడి ప్రకటించింది. 2035 నాటికి పునరుత్పాదక ఇంధనంతో నడిచే హైపర్‌స్కేల్ AIరెడీ డేటా సెంటర్ల అభివృద్ధికి 100 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఏఐ విషయంలో ప్రపంచంలో భారత్‌ను అగ్రభాగాన నిలిపేందుకు ఈ పెట్టుబడి దోహదపడుతుందని అదానీ గ్రూప్ తన ప్రకటనలో పేర్కొంది.

ప్రపంచం ఇప్పుడు పారిశ్రామిక విప్లవానికి మించిన వేగంతో ఇంటెలిజెన్స్ రివల్యూషన్‌లోకి అడుగుపెడుతోందని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. ఎనర్జీ, కంప్యూటర్‌ల మధ్య సమతుల్యతను సాధించే దేశాలే తదుపరి దశాబ్దపు రూపురేఖల్ని మార్చనున్నాయని పేర్కొన్నారు. ఈ రంగంలో భారత్ నాయకత్వ స్థానం వహించనుందని అదానీ అన్నారు. ఇందులోభాగంగానే అదానీ గ్రూప్ తరఫున డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ రూపంలో బలమైన పునాదులు వేస్తున్నామని పేర్కొన్నారు. ఏఐ యుగంలో భారతదేశం కేవలం వినియోగదారుడిగా కాకుండా.. బిల్డర్‌గా, ఇంటెలిజెన్స్ ఎగుమతిదారుగా నిలవబోతోందని, అందులో అదానీ గ్రూప్ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు.

తాజా పెట్టుబడి ప్రకటన ద్వారా 2035 నాటికి పునరుత్పాదక ఇంధనంతో నడిచే AIరెడీ డేటా సెంటర్ కెపాసిటీని నిర్మించడంపై అదానీ గ్రూప్ దృష్టిసారిస్తుంది. ఈ పెట్టుబడులతో సర్వర్ల మ్యానుఫ్యాక్చరింగ్, క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్, ఇతర అనుబంధ రంగాల్లో మరో 150 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అదానీ గ్రూప్ పేర్కొంది. మొత్తంగా రాబోయే దశాబ్దకాలంలో ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎకోసిస్టమ్ 250 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించనుందని తెలిపింది. అదానీకానెక్స్ ఇప్పటికే 2 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌ను కలిగిఉంది. దీన్ని 5 గిగావాట్ల సామర్థ్యానికి పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం గూగుల్‌తో కలిసి విశాఖపట్నం, నొయిడాల్లో; మైక్రోసాఫ్ట్‌తో కలిసి హైదరాబాద్, పుణెల్లో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది.

# చలామణిలో రూ.40 లక్షల కోట్ల నగదు



హైదరాబాద్: దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవం కొనసాగుతున్నా, ప్రజల చేతుల్లో నగదు వినియోగమూ అదే స్థాయిలో పెరుగుతోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీల సంఖ్యవిలువపరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నా, 2026 జనవరి చివరికి చలామణిలో ఉన్న నగదు పరిమాణమూ జీవనకాల గరిష్ఠమైన రూ.40 లక్షల కోట్లకు చేరినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. అయితే అయిదేళ్ల వ్యవధిలో స్థూల దేశీయోత్పత్తితో పోలిస్తే, నగదు నిష్పత్తి 14.4% నుంచి 11 శాతానికి తగ్గడం, ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులను అద్దం పడుతోంది. ఈ నివేదిక ప్రకారం.. తెలుగు రాష్ట్రాల్లో అధికంగా రూ.100 నోట్ల వినియోగం: కర్ణాటక, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ పెరుగుతుంటే, ఆంధ్రప్రదేశ్‌లో క్రమంగా తగ్గుతోంది. 202223లో ఏపీలో ఒక్కో ఏటీఎం నుంచి సగటున నెలకు రూ.1.57 కోట్లు విత్‌డ్రా అయ్యేవి. 202526 డిసెంబరుకు ఇది రూ.1.34 కోట్లకు తగ్గింది. అంటే డిజిటల్ లావాదేవీలు అధికమయ్యాయి. సాధారణంగా డిజిటల్ చెల్లింపులు పెరిగాక, తక్కువ విలువైన నోట్ల వినియోగం తగ్గుతుంది. కానీ, తెలంగాణ, ఏపీలో రూ.100 నోట్ల వినియోగం పెరుగుతోంది. తమిళనాడులో రూ.200 నోట్ల వినియోగం అధికంగా ఉంది. నగదు లావాదేవీలు ఎందుకు పెరుగుతున్నాయి? కర్ణాటక వాణిజ్య పన్నుల శాఖ చిన్న వ్యాపారులు, విక్రేతలకు దాదాపు 18,000కు పైగా జీఎస్‌టీ నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామం వ్యాపారులను డిజిటల్ చెల్లింపుల నుంచి నగదు వైపు మళ్లేలా చేసింది. బంగారం, వెండి ధరలు విపరీతంగా పెరగడం.. మార్కెట్లో నగదు లభ్యత పెరగడానికి ఒక కారణం. గృహస్థులు తమ వద్ద ఉన్న పాత ఆభరణాలను విక్రయించి, నగదుగా మార్చుకుంటున్నారు. రూ.500 నోట్లదే ఆధిపత్యం: 'యూపీఐ ప్రధానంగా చిన్న మొత్తాల నోట్లకు (రూ.100, రూ.200) ప్రత్యామ్నాయంగా మారింది. పెద్ద నోట్లకు (రూ.500) కాదు. రూ.500 కంటే తక్కువ విలువైన లావాదేవీలే యూపీఐలో 86% వాటా కలిగి ఉన్నాయి. అందుకే, మార్కెట్లో రూ.500 నోట్ల ఆధిపత్యం కొనసాగుతోంద'ని నివేదిక తెలిపింది.

## ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు బిల్‌గేట్స్ దూరం.. ఎప్‌స్టీన్ వ్యవహారమే కారణమా..?

భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు (AI Impact Summit 2026)కు మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌కు సంబంధించి ఇటీవల విడుదలైన ఫైళ్లలో ఆయన పేరు కూడా ఉంది. దాంతో గేట్స్‌కు ఇచ్చిన ఆహ్వానాన్ని కేంద్ర ప్రభుత్వం సమీక్షించిందని సమాచారం. ప్రభుత్వ వర్గాలను ప్రస్తావిస్తూ ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడాలని కోరుకుంటుందని పేర్కొన్నాయి. ఇటీవల ఎప్‌స్టీన్ ఫైళ్లను అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ చట్టం కింద అమెరికా న్యాయశాఖ వెబ్‌సైట్‌లో ఈ పత్రాలు, వీడియోలు, ఫొటోలు అందుబాటులో ఉంచింది. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. అతడు ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలు ఉన్నాయి. గేట్స్ (Bill Gates)పై ఎప్‌స్టీన్ చేసిన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అయితే వాటిని ఆయన బృందం ఖండించిన సంగతి తెలిసిందే.

**గేట్స్ ఫౌండేషన్ ఏం చెప్పిందంటే..?**

"బిల్‌గేట్స్ ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు హాజరవుతారు. అక్కడ షెడ్యూల్ ప్రకారం ఉపన్యసిస్తారు" అని గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి జాతీయ మీడియాతో వెల్లడించారు. ఈ కథనాలపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రావాల్సిఉంది.



## ఆరోగ్యబీమా క్లెయిమ్ తిరస్కరణ.. వైరల్ పోస్ట్ పై స్పందించిన స్టార్ హెల్త్



దృపరంగా ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఆదుకుంటుందన్న ఉద్దేశంతో చాలామంది ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంటారు. అదే పాలసీ అవసర సమయంలో అక్కరకు రాకపోతే..? సరిగ్గా లఖ్‌నవూకు చెందిన ఓ వ్యక్తికి ఇదే పరిస్థితి ఎదురైంది. తన తల్లి పేరిట ఆరోగ్యబీమా తీసుకుంటే తన క్లెయిమ్‌ను స్టార్‌హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సంస్థ తిరస్కరించడం వివాదాస్పదమైంది. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో స్టార్‌హెల్త్ దీనిపై స్పందించింది. తమను తప్పుగా చిత్రీకరిస్తున్నారంటూ వివరణ ఇచ్చింది.

ఇంతకీ ఏం జరిగిందంటే..?

లఖ్‌నవూకు చెందిన ఓ వ్యక్తి తన తల్లి పేరిట ఏటా రూ.50 వేలు ప్రీమియం చెల్లిస్తూ ఆరోగ్య బీమా పాలసీ తీసుకున్నాడు. తీరా తన తల్లి అనారోగ్యానికి గురైనప్పుడు క్లెయిమ్ కోసం లఖ్‌నవూలోని స్టార్‌హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కార్యాలయానికి వెళ్లాడు. గంటలతరబడి వేచి ఉంచడంతో పాటు చివరికి అతడి బీమా క్లెయిమ్‌ను తిరస్కరించారు. పైగా 'మమ్మల్ని అడిగి పాలసీ తీసుకోలేదు కదా' అని ఓ ఏజెంట్ సమాధానం ఇవ్వడం గమనార్హం. దీనిపై కురుపెంచ్‌హెల్త్ అనే ఎక్స్ హ్యాండిల్ కలిగిన వ్యక్తి వీడియో సహా విషయాన్ని పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. రచయిత నీలేశ్ మిశ్రా కూడా విమర్శలు గుప్పిస్తూ సదరు పోస్ట్‌ను రీపోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది.

**స్టార్ హెల్త్ ఏమందంటే?**

లఖ్‌నవూ వ్యక్తి క్లెయిమ్ తిరస్కరణ అంశం వైరల్‌గా మారడంతో స్టార్‌హెల్త్ స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. పాలసీ తిరస్కరించడానికి గల కారణాలను వివరించింది. "ఆరోగ్య సంబంధిత విషయాలు భావోద్వేగాలతో ముడిపడి ఉంటాయని మాకు తెలుసు. అయితే, లఖ్‌నవూ క్లెయిమ్ తిరస్కరణ విషయంలో వాస్తవాలను విస్మరించి మమ్మల్ని నిందించడాన్ని మేం ఖండిస్తున్నాం. క్లెయిమ్ మూల్యాంకన సమయంలో ప్రీ ఎగ్జిస్టింగ్ మెడికల్ హిస్టరీ ఉన్నట్లు గుర్తించాం. దానికి సపోర్టింగ్ డాక్యుమెంట్లను ఇవ్వాలని సూచించినా సమాధానం లేకపోవడంతో క్లెయిమ్ తిరస్కరించాల్సి వచ్చింది" అని వివరణ ఇచ్చింది.

సాధారణంగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు ముందస్తు అనారోగ్య సమస్యలు ఉంటే వాటిని వెల్లడించకపోవడం ఈ కేసులో ప్రధాన కారణమని తెలుస్తోంది. కొన్నిసార్లు ముందస్తు అనారోగ్య సమస్యలు ఉన్నా వెయిటింగ్ పీరియడ్‌తో పాలసీని అనుమతిస్తాయి. ప్రీమియం క్రమంతప్పకుండా చెల్లించడంతో పాటు ముందస్తు ఆరోగ్య సమస్యలను బీమా సంస్థలకు వెల్లడించడం కూడా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

## మారుతీ సుజుకీ ఇవిటారా @రూ.11 లక్షలు..

# బ్యాటరీ EMI ₹3.99km




ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన విద్యుత్ ఎస్‌యూవీ ఇవిటారాను (Maruti Suzuki e VITARA) దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.10.99 లక్షలుగా నిర్ణయించింది. బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ ఆప్షన్‌తో వస్తోంది. బ్యాటరీ ఈఎంఐ కింద కిలోమీటరుకు రూ.3.99 చొప్పున కంపెనీకి చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లోగానీ, డీలర్‌షిప్ కేంద్రాల వద్ద రూ.21 వేలు చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు. త్వరలో డెలివరీలు ప్రారంభం కానున్నాయి. ఎంజీ జడ్ఎస్ ఈవీ, హ్యుందాయ్ క్రెటా ఈవీ, టాటా కర్వ్ ఈవీ, విన్‌ఫాస్ట్ వీఎఫ్6 వంటి కార్లతో ఈ కారు పోటీ పడనుంది. ఇవిటారాను గుజరాత్ ప్లాంట్‌లో తయారుచేస్తున్నారు. అక్కడి నుంచి సుమారు 100 దేశాలకు మారుతీ సుజుకీ ఎగుమతి చేస్తోంది. 8 ఏళ్ల బ్యాటరీ వారెంటీని అందిస్తోంది. ఇవిటారా 49kWh, 61 kWh బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది. తక్కువ బ్యాటరీ సామర్థ్యం కలిగిన విటారా 144 హెచ్‌పీ పవర్‌ను, 189 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సింగిల్ ఛార్జ్‌తో 440 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు. ఇక అధిక బ్యాటరీ సామర్థ్యం కలిగిన మోడల్‌లో 174 హెచ్‌పీ పవర్‌ను, 180 ఎన్ఎం టార్క్ కలిగిన మోటార్ అమర్చారు. ఇది సింగిల్ ఛార్జింగ్‌తో 543 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.

ఇవిటారా డిజైన్ విషయానికొస్తే.. ఇందులో ఛార్జింగ్ పోర్ట్‌ను ముందువైపు ఇచ్చారు. 18 అంగుళాల వీల్స్ ఇచ్చారు. 4275 మిల్లీమీర్ల పొడవు, 1800 ఎంఎం వెడల్పు, 1635 ఎంఎం ఎత్తు, 2700 ఎంఎం వీల్ బేస్ కలిగి ఉంటుంది. 180 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్‌తో వస్తోంది. కారు లోపలి భాగంలో 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉన్నాయి. పనోరమిక్ సన్‌రూఫ్, యాంబియెంట్ లైటింగ్, వైర్‌లెస్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, మల్టిపుల్ యూఎస్‌బీ పోర్టులు, ఇన్‌క్యాబిన్ ఎయిర్‌ప్యూరిఫయర్, ఏడు ఎయిర్‌బ్యాగులు ఉన్నాయి. ఏబీఎస్, ఈబీడీ, ఈఎస్‌పీ, 360 డిగ్రీల కెమెరా, లెవల్ 2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి.

## రెండో రోజూ లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ షేర్లు రాణించడంతో స్వల్ప లాభాల్లో స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 173.81 పాయింట్ల లాభంతో 83,450.96 వద్ద ముగియగా.. నిఫ్టీ 42.65 పాయింట్ల లాభంతో 25,725.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.68గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, బీఈఎల్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటెర్నల్, టాటా స్టీల్, ట్రెంట్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.18 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4936.25 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## సామాజిక మాధ్యమాల వినియోగంపై వయసుల వారీ పరిమితులు!

సామాజిక మాధ్యమాల వినియోగంపై వయసుల వారీ పరిమితులు విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఆయా టెక్ కంపెనీలతో (సామాజిక మాధ్యమాలు) చర్చలు జరుపుతోంది. సోషల్‌మీడియా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల దృష్ట్యా ఫ్రాన్స్, ఆస్ట్రేలియా.. తదితర దేశాలు చిన్నారులు సోషల్‌మీడియా వినియోగంపై నిషేధం విధించాయి. ఈ నేపథ్యంలో భారత్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో భాగంగా కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుతం మేం డీప్‌ఫేక్‌లు, వయసు ఆధారిత నియంత్రణలపై వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో చర్చలు జరుపుతున్నాం. అనేక దేశాలు వయసు ఆధారిత నియంత్రణలను అంగీకరించాయి. భారతదేశంలో ఇది అవసరమని భావిస్తున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సైతం డిజిటల్ ఎడిక్షన్‌ను తగ్గించేందుకు వయసు ఆధారిత సోషల్ మీడియా అందుబాటు వ్యవస్థను ప్రవేశపెట్టాలని అభిప్రాయపడింది. పలువురు ఎంపీలు సైతం ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అంశం సంప్రదింపుల దశలో ఉంది.

## గిగ్ వర్కర్ల కోసం కర్ణాటక కీలక నిర్ణయం.. వారినుంచి 1 శాతం ఫీజు

**గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్విగ్గీ (Swiggy), జొమాటో (Zomato) వంటి అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ప్రతి లావాదేవీపై 1శాతం వరకు సంక్షేమ ఫీజు వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది.**

సంక్షేమ రుసుము ఒకశాతంగా పేర్కొన్నప్పటికీ.. ఆయా అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌ల ఫీజుపై గరిష్ఠ పరిమితిని నిర్ణయించింది. ఆహార పదార్థాలు, సరుకులు పంపిణీ చేసే స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో, బిగ్‌బాస్కెట్ వంటి ప్రతి లావాదేవీకి గరిష్ఠంగా 0.50పైసలుగా నిర్ణయించింది. ర్యాపిడో, ఊబర్, నమ్మయాత్రి, రైడ్ సర్వీసుల్లో బైక్‌లకు 0.50 పైసలు, త్రీవీలర్‌కు 75 పైసలు, ఫోర్ వీలర్ సర్వీసులకు ఒక రూపాయి ఫీజు వసూలు చేయనున్నట్లు పేర్కొంది. పోర్టర్, డెలివరీ వంటి లాజిస్టిక్ సర్వీస్ ప్రొవైడర్లకు వాహనం కేటగిరి ఆధారంగా గరిష్ఠంగా రూ.1.5పైసలను వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సంక్షేమ ఫీజులను అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌లు లెక్కించి ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది.



## అకౌంట్‌లో రూ.లక్ష చూస్తే చాలనుకున్నా.. విశ్వక్ సేన్



ఒకప్పుడు తన అకౌంట్‌లో రూ.50వేలు చూడటం ఓ కల అని విశ్వక్ సేన్ (Vishwak Sen) అన్నారు. 'హిట్' సినిమాకు అడ్వాన్స్ బ్యాంక్‌లో పడే వరకూ తన అకౌంట్‌లో అంత డబ్బు ఎప్పుడూ చూడలేదని గుర్తుచేసుకున్నారు. తాజాగా ఓ చిట్‌చాట్‌లో పాల్గొన్న ఆయన కెరీర్ ప్రారంభ రోజుల గురించి పంచుకున్నారు. ''మా నాన్న కరాటే నేర్పించేవారు. దానివల్ల డబ్బులు రావడం లేదని కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లోకి వచ్చారు. నేను పుట్టినప్పుడు మాకు సొంత ఇల్లు కూడా లేదు. పెద్ద చదువులు చదవాలంటే డబ్బులు ఎక్కువవుతాయని డిగ్రీలో చేరాను. నా అకౌంట్‌లో రూ.లక్ష చూస్తే చాలు అనుకున్నాను. 'ఫలక్‌నుమా దాస్' రిలీజ్ అయిన తర్వాతనే మొదటిసారి నా అకౌంట్‌లో అంత డబ్బు చూశాను. అంతకు రెండు రోజుల ముందు 'హిట్' సినిమాకు అడ్వాన్స్ ఇచ్చినప్పుడు బ్యాంక్ ఖాతాలో రూ.50వేలు చూసి ఆనందించాను''.

''నేను ఏ విషయాన్ని అయినా ముక్కుసూటిగా చెబుతాను. దానివల్ల కొన్నింటిని కోల్పోయాను. కానీ, కొన్ని విషయాల్లో గర్వంగా ఉన్నా. ఇంట్లో, బయట.. ఎక్కడైనా ఒకేలా ఉంటాను. చిన్నప్పటినుంచి ఎలా ఉన్నానో, ఇప్పుడు కూడా అలానే ఉన్నా. ఇండస్ట్రీకి వచ్చాను కదా.. అని సడన్‌గా బుద్ధుడిలా మారిపోలేను. నా దృష్టిలో ఒక్కసారి వ్యక్తిత్వాన్ని కోల్పోతే మనిషి బతికి ఉన్నా వృథానే. అందుకే దాన్ని వదులుకోను. క్యారెక్టర్‌ని కోల్పోతే మనపై మనకే గౌరవం పోతుంది. ఇలాఉంటే ఇండస్ట్రీలో రాణించలేనని చాలామంది భయపెట్టారు. 'కొన్ని రోజుల్లోనే వెళ్లిపోతావు', 'ఉండనివ్వరు నిన్ను' అని అన్నారు. మన సినిమాలే మన గురించి మాట్లాడతాయని నమ్ముతాను. సినిమా హిట్ అయితే అందులో హీరో ఎవరు అని కూడా చూడకుండా థియేటర్‌కు వస్తారు. అలాగే కథ బాగోకపోతే హీరో మనవాడే కదా అని అనుకొని సినిమాను ఎవరూ హిట్ చేయరు'' అని అన్నారు.

## ఆ పాటలు వాడొద్దు.. ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా (Ilaiyaraaja) చట్టపరమైన ఇబ్బందుల్లో ఇరుక్కున్నారు. కొన్ని రోజులుగా ఆడియో సంస్థ 'సరిగమ'కు, ఆయనకు మధ్య జరుగుతోన్న వివాదంలో న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. తుది తీర్పు వచ్చేవరకూ 134 చిత్రాలకు సంబంధించిన పాటలను ఇళయరాజా వాడుకోవడానికి వీల్లేదని ఆదేశాలిచ్చింది.

అసలు వివాదమిదే.. 1976 నుంచి 2001 వరకూ ఇళయరాజా సంగీతం అందించిన 134 చిత్రాల హక్కులను నిర్మాతలు 'సరిగమ'కు శాశ్వత ప్రతిపాదికన విక్రయించారు. తాజాగా ఇళయరాజా ఈ పాటలను ఉపయోగించవచ్చు అని కొన్ని మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు అనుమతులు ఇచ్చారు. దీంతో ఆ సంస్థ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం (Delhi High Court) ఆ పాటలను వాడుకోవడానికి వీల్లేదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాత నుంచి కొనుగోలు చేసిన తర్వాత పూర్తి హక్కులు సరిగమకే ఉంటాయని కోర్టు తెలిపింది. వారి అనుమతి లేకుండా ఆ పాటలను ఉపయోగించకూడదని పేర్కొంది. గతేడాది విడుదలైన 'అగత్యా' సినిమాలోని ఓ పాట విషయంలో ఇళయరాజాకు, 'సరిగమ'కు మధ్య వివాదం నెలకొంది. అప్పటినుంచి ఈ వివాదం ముదురుతోంది.

# సౌత్ హీరోయిన్లు అంటే చిన్న చూపు..



**సౌత్ ఇండస్ట్రీకి చెందిన హీరోయిన్లలో చాలా మందికి ఒక కోరిక ఉంటుంది. ఇక్కడ స్టార్ హోదా వచ్చాకా..బాలీవుడ్‌కి వెళ్లి సత్తా చాటాలని అనుకుంటారు. సౌత్‌లో రెండు, మూడు హిట్లు పడితే చాలు.. బాలీవుడ్‌పై ఫోకస్ చేస్తారు. అలా దక్షిణాది నుంచి వెళ్లిన తారల్లో కొంతమంది బాలీవుడ్‌లోనూ రాణిస్తే.. మరికొంతమంది అవకాశాలు రాక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొని తిరిగి వచ్చారు. చాన్స్‌ల సంగతి పక్కన పెడితే.. సౌత్ వాళ్లకు సరైన గౌరవం కూడా ఇవ్వరని అంటోంది నటి రేజీనా కసాండ్రా.**

16 ఏళ్లకే కెరీర్‌ని ప్రారంభించిన రెజీనా.. తెలుగులో రవితేజ, గోపీచంద్, సాయిదుర్గ తేజ్, సందీప్ కిషన్ లాంటి హీరోలతో సినిమాలు చేసి మెప్పించింది. అయితే ఇక్కడ వచ్చిన గుర్తింపుతో బాలీవుడ్ ప్రయత్నాలు చేసింది. 'ఏక్ లడ్కీకో దేఖా తో ఐసా లగా' అనే చిత్రంలో ఆమె నటించింది. ఆ మూవీతో రెజీనాకు కూడా అంత పేరేమీ రాలేదు. తర్వాత మరి కొన్ని హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది. ఆ సినిమా ఫలితాల సంగతి పక్కన పెడితే.. అసలు బాలీవుడ్‌కి దక్షిణాది నటీనటులు అంటే చిన్నచూపు అని.. వాళ్ల ప్రవర్తనే వెరైటీగా ఉంటుందని రెజీనా అంటోంది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాల గురించి రెజీనా చెప్పుకొచ్చింది. 'బాలీవుడ్ లో నా ప్రయాణం ఊహించినంత సులభంగా సాగలేదు. హిందీ భాషపై నాకు పూర్తి పట్టు ఉన్నా, మాట్లాడటంతో పాటూ హిందీ రాయగలిగినా, వేరే సినిమాల్లో ఇతర హీరోయిన్లలాగా డబ్బింగ్ ఆర్టిస్టులను వినియోగించుకోకపోయి నా బాలీవుడ్ లో నేను పూర్తిగా కలిసిపోయాననే ఫీలింగ్ కలగలేదు. సౌత్ నుంచి వచ్చిన నన్ను కొందరు వేరేలా చూశారు. నా నేపథ్యాన్ని తక్కువ చేసి మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. కొందరి ప్రవర్తన, మాట తీరు అసౌకర్యానికి గురి చేసింది. అవన్నీ చూశాక నాలో ఒక రకమైన భయం మొదలైంది' అని రెజీనా చెప్పుకొచ్చింది.ఇలాంటి అనుభవం అందరికి ఎదురవుతుందని కూడా చెప్పలేమన్నారు. అంతేకాదు బాలీవుడ్ మొత్తం అలాంటిదే అని చెప్పడం కూడా కరెక్ట్ కాదని రెజీనా అన్నారు. అందరూ ఒకేలా ఉండరని, తనకు మద్దతుగా నిలుస్తూ, గౌరవించిన వాళ్లు కూడా ఉన్నారని రెజీనా చెప్పింది.



## విజయ్ ఆంటోనీ మూవీ.. వాటి వల్లే నాకు ఛాన్స్: మంచు లక్ష్మి



హైదరాబాద్: 'బిచ్చగాడు'తో టాలీవుడ్‌లో క్రేజ్ దక్కించుకున్న కోలీవుడ్ నటుడు విజయ్ ఆంటోనీ (Vijay Antony). ఆయన నిర్మాతగా.. ఎడిటర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వ్యవహరించిన చిత్రం 'బూకి' (ఇదో నిక్‌నేమ్). ఇప్పటికే తమిళంలో విడుదలైన ఈ సినిమా ఈ నెల 20న (Bookie Release Date) తెలుగులో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర బృందం పలు విశేషాలు పంచుకుంది. ఆ సంగతులివీ..

పాట పాడే అవకాశం ఇవ్వలేదు: మంచు లక్ష్మి

''యూనివర్సల్ స్టోరీ ఇది. ఈ సినిమాని కొరియన్‌లో చూసినా అర్థమవుతుంది. తన మేనల్లుడు అజయ్ ధీశన్ ప్రతిభను గుర్తించిన విజయ్ ఆంటోనీ ఈ సినిమాతో అతడిని ప్రోత్సహించారు. ఈ మూవీ హీరోయిన్ ధనూష తెరపైన, తెర వెనుకా అందంగా ఉంటుంది. నన్ను మాత్రం చాలామంది 'సినిమాల్లో కన్నా బయటే బాగుంటారు' అని అంటుంటారు (నవ్వుతూ). కానీ, నేను స్క్రీన్‌పైనే అందంగా కనిపించాలని కోరుకుంటా. విజయ్ ఈ సినిమాలో నాకు పాట పాడే అవకాశం ఇవ్వలేదు. తదుపరి చిత్రంలో ఇస్తానన్నారు. నా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూసి సైకియాట్రిస్ట్ రోల్‌కు ఎంపిక చేశారని తెలిశాక.. రీల్స్‌లో మరింత యాక్టివ్ అయ్యా'' అని మంచు లక్ష్మి పేర్కొన్నారు.

''మీ అందరి సపోర్ట్ వల్లే ఈ స్థాయిలో ఉన్నా. నాతో కలిసి అజయ్ నటించిన 'మార్గన్'ను మీరంతా ఆదరించారు. 'బూకి'ని కూడా హిట్ చేస్తారని ఆశిస్తున్నా. ఇది జెన్‌జీ స్టోరీ అని అనుకోవద్దు. అందరికీ కనెక్ట్ అవుతుంది. నాకు తెలుగు రాకపోయినా ఇక్కడి వారు అభిమానిస్తున్నారు. కానీ, అజయ్ తెలుగువాడే. అతడి తండ్రిది తిరుపతి'' అని విజయ్ ఆంటోనీ తెలిపారు.

దర్శకుడు గణేశ్ చంద్ర మాట్లాడుతూ.. ''సినిమాటోగ్రాఫర్‌గా నా తొలి సినిమా విజయ్ ఆంటోనీ నటించిన 'డాక్టర్ సలీమ్'. నన్ను నమ్మి 'బూకి' తెరకెక్కించే అవకాశం ఇచ్చినందుకు ఆయనకు థాంక్స్'' అని పేర్కొన్నారు.

## 'లైకా' కేసు.. విశాల్ పిటిషన్‌ను కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు



ప్రముఖ నిర్మాణ సంస్థ 'లైకా ప్రొడక్షన్స్'కు సంబంధించిన కేసులో న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులను పాటించేందుకు గడువు కోరుతూ నటుడు విశాల్ (Vishal) దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. లైకాకు చెల్లించాల్సిన రూ.21.29 కోట్లను 30% వడ్డీతో కలిపి ఇవ్వాలని నటుడికి మద్రాస్ హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారు.

ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ విశాల్ దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం సింగిల్ జడ్జ్ ఉత్తర్వులపై మధ్యంతర స్టే విధించింది. విశాల్ రూ.10 కోట్లు డిపాజిట్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో రూ.10 కోట్లను డిపాజిట్ చేసేందుకు ఆరు వారాల గడువు కావాలని విజ్ఞప్తి చేస్తూ విశాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు ధర్మాసనం గడువిచ్చేందుకు నిరాకరించి, విశాల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సినిమా తీస్తానని తమ వద్ద విశాల్ రూ.21.29 కోట్లు అప్పుగా తీసుకున్నారని, ఆ డబ్బు తిరిగి చెల్లించలేదంటూ 2022లో లైకా మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అప్పటి నుంచి న్యాయ పోరాటం చేస్తూనే ఉంది.

## వావ్..! ఏఐతో రజనీకాంత్ 'కొచ్చడైయాన్'.. టీజర్ చూశారా?



రజనీకాంత్ (Rajinikanth) కథానాయకుడిగా ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'కొచ్చడైయాన్'. 2014లో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో ఈ సినిమాను తెరకెక్కించారు. అయితే, బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఏదో కార్టూన్ సినిమాను చూసిన భావన కలిగిందంటూ ప్రేక్షకులు పెదవి విరిచారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో ఏఐ రాజ్యమేలుతోంది. దాని సాయంతో 'కొచ్చడైయాన్'కు సరికొత్త హంగులు దిద్దారు. మొత్తం మూవీని ఏఐ సాయంతో రీ జనరేట్ చేసింది. ఇందుకు సంబంధించిన టీజర్‌ను విడుదల చేసింది. మరి ఆ టీజర్ ఎలా ఉందో చూసేయండి.

## ది కేరళ స్టోరీ సీక్వెల్.. బోల్డ్ అండ్ వయొలెంట్‌గా ట్రైలర్



ఆదా శర్మ కీలక పాత్రలో వచ్చిన చిత్రం ది కేరళ స్టోరీ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. ఎన్ని విమర్శలు, వివాదాలు ఎదురైనప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అభిమానుల ఆదరణ దక్కించుకుంది. ఈ సినిమా సూపర్ హిట్ కావడంతో మేకర్స్ సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. కేరళలోని అమ్మాయిలను మత మార్పిడి చేసి గల్ఫ్ దేశాలకు తీసుకెళ్లిన రియల్ స్టోరీతో ది కేరళ స్టోరీని తెరకెక్కించారు. . సుదీప్తో సేన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఏకంగా రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు గెలిచింది.

తాజాగా ఈ మూవీకి సీక్వెల్ వస్తోన్న ది కేరళ స్టోరీ-2 గోల్ బియాండ్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తుంటే మనదేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలను లవ్ పేరుతో మత మార్పిడి చేసి చిత్ర హింసలకు గురి చేసే కథాంశంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ మూవీ రియల్ సంఘటనల ఆధారంగానే రూపొందించారు. ఈ చిత్రాన్ని ముగ్గురు హిందూ అమ్మాయిల జీవితం ఆధారంగా తెరకెక్కించారు.

కాగా.. ఈ చిత్రానికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని సన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌లో విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఈ సినిమాకు మన్నన్ షా సంగీతం అందించారు. ఈ సీక్వెల్ ఫిబ్రవరి 27న థియేటర్లలో విడుదల కానుంది.

కాగా.. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో అదా శర్మ, సిద్ధి ఇద్నాని, యోగితా బిహాని, సోనియా బలాని ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ కథ కేరళకు చెందిన కొంతమంది మహిళలు ఇస్లాంలోకి ఎలా మారారు అనే కోణంలో ఈ మూవీని తెరకెక్కించారు.

## షమీ 8 వికెట్ల ప్రదర్శన వృథా



**జమ్మూ అండ్ కశ్మీర్ క్రికెట్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించేందుకు చేరువలో ఉంది. రంజీ ట్రోఫీ 2025-26 ఎడిషన్‌లో ఫైనల్‌కు చేరేందుకు ఆ జట్టు మరో 83 పరుగుల దూరంలో ఉంది. చేతిలో 8 వికెట్లు ఉన్నాయి. మరో రోజు ఆట మిగిలి ఉంది.**

బెంగాల్‌తో జరుగుతున్న రెండో సెమీఫైనల్లో 126 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదిస్తున్న జమ్మూ టీమ్.. మూడో రోజు ఆట ముగిసే సమయాని కి 2 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. శుభమ్ పుండిర్ (23), వన్ష్‌రాజ్ శర్మ (9) క్రీజ్‌లో ఉన్నారు.

చివరి రోజు జమ్మూ లక్ష్యాన్ని ఛేదిస్తే సరికొత్త చరిత్ర అవుతుంది. రంజీ చరిత్రలో జమ్మూ ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఫైనల్‌కు చేరలేదు. ఇంకా చెప్పాలంటే సెమీస్‌కు చేరడం కూడా ఇదే మొదటిసారి.

తొలి ఇన్నింగ్స్‌లో 26 పరుగులు వెనుకపడి కూడా అనూహ్యంగా పుంజుకొని, బెంగాల్‌ను 99 పరుగులకే (రెండో ఇన్నింగ్స్) కుప్పకూల్చిన జమ్మూ జట్టు, సరికొత్త చరిత్రకు అద్భుత పునాది వేసింది. అనంతరం స్వల్ప ఛేదనలో 12 పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయినా ఏమాత్రం జంక లేదు. మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి మూడో రోజు ఆటను ముగించింది.

**మరోసారి చెలరేగిన నబీ**

తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగిన ఆకిబ్ నబీ మరోసారి విజృంభించాడు. రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటి బెంగాల్‌ను మడత పెట్టడంతో పెద్ద చెయ్యి వేశాడు. అతనికి సునీల్ కుమార్ (427), యుద్‌ధ్‌వీర్ చరక్ (50292) సహకరించారు. వీరి ధాటికి బెంగాల్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది. షాబాజ్ అహ్మద్ (24) ఒక్కడే 20కి పైగా పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో సుదిప్ ఘరామీ సహా సుదిప్ చటర్జీ, ఆకాశ్‌దీప్ డకౌట్లయ్యారు.

**విజృంభించిన షమీ**

అంతకుముందు టీమిండియా ప్లేయర్ మహ్మద్ షమీ 8 వికెట్ల ప్రదర్శనతో విజృంభించడంతో జమ్మూ తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులకు ఆలౌటైంది. బౌలింగ్‌లో చెలరేగిన నబీ బ్యాట్‌తోనూ రాణించడంతో జమ్మూ టీమ్ ఈ స్కోర్ చేయగలిగింది. నబీ (42).. యద్‌దవీర్ చరక్‌తో (33) తొమ్మిదో వికెట్‌కు 64 పరుగులు జోడించి, తన జట్టును 300 పరుగుల మార్కును దాటించాడు. అంతకుముందు కెప్టెన్ పరాస్ డోగ్రా (58), అబ్దుల్ సమద్ (82) అర్ధ సెంచరీలతో రాణించారు.

**ఘరామీ అద్భుత శతకం**

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బెంగాల్.. సుదిప్ ఘరామీ అద్భుత శతకంతో (146) కదంతొక్కడంతో తొలి ఇన్నింగ్స్‌లో 328 పరుగులు చేసింది. ఆకిబ్ నబీ 5, సునీల్ కుమార్ 3 వికెట్లతో సత్తా చాటారు.

## భారత స్టార్‌ను కిందకి దించి అగ్రపీఠాన్ని అధిరోహించిన పాక్ ప్లేయర్




**ఐసీసీ తాజాగా ప్రకటించిన మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ ప్లేయర్లకు మిశ్రమ అనుభవాలు ఎదురయ్యాయి. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో స్టార్ స్పిన్నర్ దీప్తి శర్మ అగ్రస్థానాన్ని కోల్పోయి రెండో స్థానానికి పడిపోయింది. టాప్ ప్లేస్‌కు పాక్ స్పిన్నర్ సదియా ఇక్బాల్ ఎగబాకింది.**

గత వారం ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉండిన సదియా రెండు స్థానాలు మెరుగుపర్చుకుంది. సదియా (743), దీప్తి శర్మ (729) మధ్య పాయింట్ల వ్యత్యాసం 14 పాయింట్లు మాత్రమే.

ఆసీస్ పర్యటన తొలి టీ20లో పెద్దగా ప్రభావం (20191) చూపకపోవడంతో దీప్తి టాప్ ర్యాంక్‌ను కోల్పోవాల్సి వచ్చింది. మరోవైపు సదియా సౌతాఫ్రికాతో తాజాగా జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 5.82 ఎకానమీతో 5 వికెట్లు తీసి టాప్ ర్యాంక్‌కు చేరుకుంది.

**టాప్ 10లోకి దూసుకొచ్చిన రేణుకా సింగ్**

తాజా ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పేసర్ రేణుకా సింగ్ టాప్ 10లోకి దూసుకొచ్చింది. ఆసీస్‌పై తొలి టీ20లో అద్భుత ప్రదర్శన (41142) కనబర్చడంతో ఆరు స్థానాలు మెరుగుపర్చుకొని ఐదో స్థానానికి ఎగబాకింది.

**అరుంధతి అదుర్స్**

ఇదే మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా (40224) చెలరేగిన మరో భారత పేసర్ అరుంధతి రెడ్డి ఏకంగా 19 స్థానాలు మెరుగుపర్చుకొని 17వ స్థానానికి ఎగబాకింది. ఇదే మ్యాచ్‌లో రాణించిన స్పిన్నర్ శ్రీచరణి (30142) ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని 39వ స్థానానికి ఎగబాకింది.

బ్యాటర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఈ వారం పెద్దగా మార్పుల్లేవు. బెత్ మూనీ, హేలీ మాథ్యూస్, స్మృతి మంధన టాప్ 3లో కొనసాగుతున్నారు. భారత బ్యాటర్లలో షఫాలీ వర్మ ఆరో స్థానాన్ని నిలబెట్టుకోగా.. జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ తలో స్థానాన్ని మెరుగుపర్చుకొని 11, 12 స్థానాలకు ఎగబాకారు.

పాక్ కెప్టెన్ ఫాతిమా సనా ఏకంగా 31 స్థానాలు మెరుగుపర్చుకొని 29వ స్థానానికి ఎగబాకింది. మిగతా చెప్పుకోదగ్గ మార్పుల్లో సౌతాఫ్రికా బ్యాటర్ అనెరీ డెర్క్‌సన్ 13 స్థానాలు మెరుగుపర్చుకొని 76కు.. ఆసీస్ బ్యాటర్ జార్జియా వేర్హమ్ 9 స్థానాలు మెరుగుపర్చుకొని 90వ స్థానానికి ఎగబాకారు.

ఆల్‌రౌండర్ల విభాగంలోనూ పెద్దగా మార్పుల్లేవు. హేలీ మాథ్యూస్, అమేలియా కెర్, దీప్తి శర్మ టాప్ 3లో కొనసాగుతుండగా.. పాక్ కెప్టెన్ ఫాతిమా సనా మాత్రం 5 స్థానాలు మెరుగుపర్చుకొని ఆరో స్థానానికి చేరింది.

# అభిషేక్ శర్మ..
# అభిమన్యుడు కాదు అర్జునుడు అతడు..!




**○ టీమ్ఇండియా (Team India) టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మ (Abhishek Sharma) పేరు చెబితే సునామీ ఇన్నింగ్స్‌లే గుర్తుకువస్తాయి. ప్రత్యర్థి బౌలర్లను అతడు హడెలెత్తించే ఊచకోతే జ్ఞప్తికి వస్తుంది. కానీ.. అభిషేక్ శర్మ గత కొన్ని ఇన్నింగ్స్‌లుగా తడబడుతున్నాడు. పొట్టి ప్రపంచకప్‌లో టీమ్ఇండియా ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడింది. ఉదర సంబంధ సమస్యతో బాధపడిన అభిషేక్.. ఢిల్లీ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో పాల్గొనలేదు. అమెరికాతో, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచుల్లో డకౌట్ అయ్యాడు. అభిషేక్ ఇప్పటివరకు ఈ ప్రపంచకప్‌లో తన పరుగుల ఖాతా తెరవలేదు.**

**○ రిథమ్‌లోనే ఉన్నాడు..కానీ!**

పొట్టి ప్రపంచకప్‌నకు (ICC Mens T20 World Cup) ముందు స్వదేశంలో.. భారత్, న్యూజిలాండ్ మధ్య అయిదు టీ20ల సిరీస్ జరిగిన విషయం తెలిసిందే. దీన్ని 41 తేడాతో టీమ్ఇండియా సొంతం చేసుకుంది. మొదటి టీ20లో అభిషేక్ కేవలం 35 బంతుల్లోనే 84 పరుగులు సాధించాడు. రెండో మ్యాచ్‌లో మాత్రం గోల్డెన్ డకౌట్ అయ్యాడు. మూడో టీ20లో మళ్లీ రిథమ్ అందుకున్న అభిషేక్ 20 బంతుల్లోనే 68 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. కానీ నాలుగో టీ20లో మళ్లీ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. అయిదో మ్యాచ్‌లో దూకుడుగా ఆడి 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు.

**○ చివరి ఏడు ఇన్నింగ్స్‌ల్లో..**

ఇలా అతడు తన చివరి ఏడు ఇన్నింగ్స్‌ల్లో నాలుగు సార్లు డకౌట్లయ్యాడు. అలాగే అందులో రెండు హాఫ్ సెంచరీలున్నాయి. ఇది కాస్త ఆందోళన కలిగించే అంశమే. కానీ అభిషేక్ శర్మకు ఒక్క ఇన్నింగ్స్ చాలు.. తిరిగి గాడిలో పడటానికి. ఇప్పటికే భారత్ సూపర్ 8కి చేరుకుంది. గ్రూప్ స్టేజీలో నామమాత్రమైన నాలుగో మ్యాచ్ నెదర్లాండ్స్‌తో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా బుధవారం జరగనుంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడి తిరిగి టచ్‌లోకి రావాల్సిన అవసరం ఉంది.

**○ బౌలర్లు.. డీ కోడ్ చేశారా?**

అభిషేక్ శర్మను బౌలర్లు డీ కోడ్ చేశారా.. అందుకే వరుసగా ఇలా బ్యాటింగ్‌లో విఫలమవుతున్నాడా.. అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. కానీ అభిషేక్‌ను ఇంకా బౌలర్లు డీ కోడ్ చేయలేదనే పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అతడు మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడాలని చూడటం వల్లే కొన్నిసార్లు వికెట్ కోల్పోతున్నాడని వారు విశ్లేషిస్తున్నారు. అభిషేక్ ఒకటి రెండు బంతులు చూసి, తర్వాత నుంచి తన ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాలని సూచిస్తున్నారు. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ (Sunil Gavaskar) సైతం అభిషేక్‌ను తొలి బంతికి సింగిల్ తీయమని సూచిస్తున్నాడు. తర్వాత వేగం పెంచమంటున్నాడు. సూపర్ 8 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇకపై అభిషేక్ శర్మ బ్యాట్‌తో రాణించడం టీమ్ఇండియాకు ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో అతడు వచ్చీరాగానే నేరుగా టాప్‌గేర్‌లోకి వెళ్లకుండా.. క్రమంగా వేగం పెంచుతూ పరుగుల వరద పారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత పొట్టి ప్రపంచకప్‌లో..శ్రీలంక ఓపెనర్ నిశాంక, కెనడా ఓపెనర్ యువరాజ్ సమ్రా సెంచరీలు సాధించిన నేపథ్యంలో ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నం.1 స్థానంలో కొనసాగుతున్న అభిషేక్ శర్మ సైతం సెంచరీ చేస్తే చూడాలని అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు. తాను బౌలర్ల పద్మవ్యూహంలో చిక్కుకునే అభిమన్యుడు కాదని.. దాన్ని ఛేదించే అర్జునుడు అని మరోసారి నిరూపించుకోవాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

# కప్ మీద కాళ్లు..
# అప్పటి నుంచి ఆసీస్‌కు తిప్పలు!

**ఐసీసీ ఈవెంట్లలో ఆస్ట్రేలియా (Australia) ప్రదర్శన దారుణంగా పడిపోతూ వస్తోంది. ఒకప్పుడు ఏ టోర్నీ పెట్టినా టైటిల్ ఫేవరెట్‌గా నిలుస్తూ వచ్చిన కంగారూలు.. ఇప్పుడు నానా తిప్పలు పడుతున్నారు. దీనికి సోషల్ మీడియాలో ఓ వాదన నడుస్తోంది. అదే 'అగౌరవం'. అసలేమైందంటే?**




ప్రపంచకప్ గెలిస్తే దాన్ని ఎంత గౌరవంగా చూడాలి చెప్పండి. మనవాళ్లు ప్రపంచకప్ గెలిచినప్పుడు దేశం మొత్తం పండగ చేసుకొంది. కానీ 2023 వన్డే ప్రపంచకప్ గెలిచాక ఆస్ట్రేలియా ఓవర్ చేసింది. ప్రస్తుత టీ20 జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్ ఏకంగా ప్రపంచకప్ మీద కాళ్లు పెట్టి ఫొటోకు పోజిచ్చాడు. ఇదేంటిలా అని అడిగితే తన చర్యను సమర్థించుకున్నాడు కూడా. ఆ అగౌరవ ప్రభావమే ఐసీసీ టోర్నీల్లో ఆ జట్టు పేలవ ప్రదర్శనకు కారణమని సోషల్ మీడియాలో పోస్టులు కనిపిస్తున్నాయి.

జింబాబ్వేతో జరిగిన మ్యాచులో కంగారూలు ఓడిపోయాక మొదలైన ఈ చర్చ శ్రీలంకతో ఓటమిపాలయ్యాక రెండింతలైంది. ఇప్పుడు ఏకంగా టోర్నీ నుంచి ఆ జట్టు నిష్క్రమించాక పోస్టులు రీపోస్టులు అవుతున్నాయి. ఐర్లాండ్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో చెరో పాయింట్ పంచుకుని జింబాబ్వే సూపర్ 8కి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.

**2023 తర్వాత ఆసీస్ ప్రదర్శన చూస్తే...**

**2024 టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8లో నిష్క్రమించింది.**

**2025 ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో భారత్ చేతిలో ఓడిపోయింది.**

**2025 డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆసీస్‌ను దక్షిణాఫ్రికా ఓడించింది.**

**2026 టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశలోనే నిష్క్రమించింది.**

## చెలరేగిన జోన్స్.. నేపాల్ టార్గెట్ ఎంతంటే..?



టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇవాళ (ఫిబ్రవరి 17) రాత్రి 7 గంటలకు మొదలైన నామమాత్రపు మ్యాచ్‌లో స్కాట్లాండ్, నేపాల్ జట్లు తలపడుతున్నాయి. ఈ రెండు జట్లు ఇదివరకే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ ఓ మోస్తరు స్కోర్ చేసింది.

ఓపెనర్ మైఖేల్ జోన్స్ (45 బంతుల్లో 71; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీతో సత్తా చాటడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. స్కాటిష్ ఇన్నింగ్స్‌లో జోన్స్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. మరో ఓపెనర్ జార్జ్ మున్సే (27), బ్రాండన్ మెక్‌ముల్లెన్ (25), కెప్టెన్ రిచీ బెర్రింగ్టన్ (10), మార్క్ వాట్ (10 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేశారు. మిగతా ఆటగాళ్లలో టామ్ బ్రూస్ (5), మాథ్యూ క్రాస్ (4), మైఖేల్ లీస్క్ (4) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. నేపాల్ బౌలర్లలో సోమ్‌పాల్ కామీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఇతను 4 ఓవర్లలో కేవలం 25 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీశాడు. మరో బౌలర్ నందన్ యాదవ్ కూడా పర్వాలేదనిపించాడు. ఇతను 4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. కుషాల్ భుర్టెల్, కెప్టెన్ రోహిత్ పౌడెల్ తలో వికెట్ తీశారు. ఓ దశలో భారీ చేస్తుందనుకున్న స్కాట్లాండ్ చివర్లో త్వరితగతిన వికెట్లు కోల్పోయి ఓ మోస్తరు స్కోర్‌కే పరిమితమైంది.

అనంతరం ఛేదనకు దిగిన నేపాల్ ఆచితూచి ఆడుతుంది. తొలి 4 ఓవర్లలో ఆ జట్టు వికెట్లు కోల్పోకుండా 26 పరుగులు మాత్రమే చేసింది. ఓపెనర్లు కుషాల్ భుర్టెల్ 14, ఆసిఫ్ షేక్ 12 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో నేపాల్ గెలవాలంటే మరో 145 పరుగులు చేయాలి.

## ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్ రద్దు.. ఆస్ట్రేలియాకు షాక్!



రెండు పరాజయాలతో సూపర్ 8 ఛాన్స్‌ను వేరే జట్ల ఫలితంపై ఆధారపడాల్సిన దుస్థితిలో ఉన్న ఆస్ట్రేలియాకు షాక్ తగిలింది. టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.00 గంలకు ఐర్లాండ్, జింబాబ్వే మధ్య మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉంది. వర్షం వల్ల మ్యాచ్ జరగలేదు. ఎంతకీ వరుణుడు కరుణించకపోవడంతో ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్ రద్దైనట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఐర్లాండ్, జింబాబ్వేలకు చెరో పాయింట్ వచ్చింది. ఈ పరిణామంతో ఆస్ట్రేలియా అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. గ్రూప్ బీలో శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఒమన్ ఆడుతున్న విషయం తెలిసిందే. మూడు మ్యాచులకు మూడింట్లోనే పరాజయం పాలైన ఒమన్ ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించింది. శ్రీలంక సూపర్ 8కి క్వాలిఫై అయింది. దాని ఖాతాలో 6 పాయింట్లున్నాయి. తాజాగా ఐర్లాండ్‌తో వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో జింబాబ్వే ఖాతాలోకి ఒక పాయింట్ వచ్చింది. దీంతో ఆ జట్టు 5 పాయింట్లతో సూపర్ 8కు క్వాలిఫై అయింది. గ్రూప్ బీ నుంచి ఆస్ట్రేలియా, ఐర్లాండ్ టోర్నీ నుంచి ఇంటి ముఖం పట్టాయి. శుక్రవారం (ఫిబ్రవరి 20) ఆస్ట్రేలియా, ఒమన్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ పోరులో ఆసీస్ విజయం సాధించినా.. దాని ఖాతాలో కేవలం నాలుగు పాయింట్లే ఉంటాయి. దీంతో అది ఆసీస్ విషయంలో నామమాత్రపు మ్యాచే. ఇప్పటికే గ్రూప్ ఏ నుంచి భారత్... గ్రూప్ సీ నుంచి వెస్టిండీస్, ఇంగ్లాండ్... గ్రూప్ డీ నుంచి దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ సూపర్ 8కు వెళ్లాయి. తాజాగా గ్రూప్ బీ నుంచి శ్రీలంకతోపాటు జింబాబ్వే సూపర్ 8కి అర్హత సాధించింది. గ్రూప్ ఏలో మరో స్లాట్ భర్తీ కావాల్సి ఉంది. ఆ స్థానం కోసం పాకిస్థాన్, యూఎస్ఏ పోటీపడుతున్నాయి